క్లుప్తంగా

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న కాటికోటేశ్వరుడు

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలో కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధారణంగా శివాలయాల్లో సోమవారం పూజలు నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ భక్తులు ఆదివారం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ నిద్ర చేయడం ఆనవాయితీ. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించారు. ముందుగా భక్తులు గదాగుండం (కోనేరు)లో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులు స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు.

పేద మహిళకు కుట్టు మిషన్ అందజేత



మహిళకు కుట్టుమిషన్ అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన మానస అనే మహిళకు జీవన ఉపాధి కోసం రక్తబంధం ఆర్గనైజేషన్ ట్రస్ట్ సభ్యులు కుట్టు మిషన్‌ను ఉచితంగా అందజేశారు. ట్రస్ట్ సభ్యులు కిరణ్, చంద్రశేఖర్, ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ గతేడాది మానస భర్త ప్రసాద్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆమె కుటుంబం జీవనోపాధి కల్పించడానికి కుట్టు మిషన్‌ను అందించామని తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై ఈదుల ముష్టూరు క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి మూడు చక్రాల వాహనంపై అనంతపురం బయలుదేరాడు. ఇదే సమయంలో కదిరి నుంచి అనంతపురం వెళ్తున్న కారు మూడు చక్రాల వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో మద్దిలేటి తీవ్రంగా గాయపడ్డాడు. అయితే కారు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయారు. బత్తలపల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీసీ కెమెరాల్లో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

కదిరి టౌన్: ప్రభుత్వ భూమి నకిలీ పత్రాలు సృష్టించి ప్రజలను మోసం చేసిన కేసులో షేక్ షామీర్ బాషా అనే వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. షామీర్ బాషా ఇంటిలో సోదా చేయగా 301 దొంగ పట్టాలు, 168 జిరాక్స్ దొంగ పట్టాలు లభించాయన్నారు. ఇదే కేసులో ఓడీచెరువు ఆర్ఐ మున్వర్, పరికి షామీర్ బాషా, కొలిమి అర్షద్‌ను అరెస్ట్ చేస్తామన్నారు.

12వ పీఆర్‌సీని ప్రకటించాలి



మాట్లాడుతున్న శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ధర్మవరం అర్బన్, రూరల్ కమిటీల ఎన్నికలు జరిగాయి. జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 5 నెలలు కావొస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీని ప్రకటించలేదన్నారు. ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా రూ.350 కోట్లు మాత్రమే చెల్లించారని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ 30 శాతం వెంటనే ప్రకటించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

- **నూతన కమిటీలు ఇవే.**

ధర్మవరం పట్టణాధ్యక్షుడిగా జింకా హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పోసా సాయిగణేష్, గౌరవాధ్యక్షుడిగా రామకృష్ణనాయక్, ఉపాధ్యక్షులుగా బి.ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలిగా లతాదేవి, కోశాధికారిగా హెచ్.రామంజనేయులు, జిల్లా కౌన్సిలర్లుగా మేరివరకుమారి, మణిమాల, లక్ష్మయ్య, రాంప్రసాద్, ధర్మవరం రూరల్ అధ్యక్షుడిగా ఎం.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా జనార్ధన్‌బాబు, గౌరవాధ్యక్షుడిగా పూజారి విజయభాస్కర్, ఉపాధ్యక్షురాలిగా తులసి, ఉపాధ్యక్షులుగా ఎం.వి వెంకటకిషోర్, కోశాధికారిగా అమర్‌నారాయణరెడ్డిలను ఎన్నుకున్నారు.

రబీ కలిసొచ్చేనా!

- సబ్ డివిజన్‌లో రబీ సాగుకు ప్రణాళిక సిద్ధం

ధర్మవరం నియోజకవర్గంలో రబీ సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

మండలం	సాధారణ విస్తీర్ణం	ప్రస్తుతం సాగు
ధర్మవరం	3,160	300
బత్తలపల్లి	2,700	170
తాడిమర్రి	2,000	100
ముదిగుబ్బ	5,150	450



చిగిచెర్ల వద్ద వేరుశనగ విత్తనాన్ని ట్రాక్టర్‌తో వేస్తున్న రైతులు



సాగుకు ముందు విత్తన శుద్ధి చేసుకుంటున్న రైతు

ధర్మవరం రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో రైతులు రబీపైనే ఆశలు పెట్టుకున్నారు. రబీ ఆరంభంలోనే అల్పపీడనం కారణంగా నియోజకవర్గంలోని చెరువులు నిండడంతో బోరు బావుల్లో సమృద్ధిగా నీరు చేరుతోంది. అదనులో వానలు పడడంతో విత్తనాలు వేసుకోవడానికి అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లోని ఆరు మండలాల్లో వేరుశనగ పంటను సాగు చేసుకునే అవకాశాలుండడంతో రైతులకు పంట సాగులో సలహాలు, సూచనలు గ్రామ స్థాయిలో అందిస్తున్నారు. డివిజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం దాదాపు 13 వేల ఎకరాలు కాగా అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

నిండా ముంచిన ఖరీఫ్

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు మురిపించాయి. దీంతో ఎన్నో ఆశలతో సాగుకు సన్నద్ధమయ్యారు. తీరా విత్తనం విత్తడానికి అదును రావడంతో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో పొలాలు దుక్కి దున్నడానికి సేద్యపు ఖర్చులు వృధా అయ్యాయి. బోరు బావుల్లో నీరున్నా రైతులు మాత్రమే వేరుశనగ పంట సాగు చేశారు. మెట్ట రైతులు నియోజకవర్గంలో ఏ కొద్ది మందో పంటను సాగు చేసుకున్నారు. సీజన్ చివర్లో తుఫాను కారణంగా వర్షాలు కురిశాయి. దీంతో బోరు బావులు కింద సాగు చేసి తొలగించుకున్న పంట కాస్త తడిచిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

నేటికీ అందని 'అన్నదాత సుఖీభవ'

ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతాంగాన్ని ఆదుకోవడానికి అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని హామీనిచ్చారు. అయితే నేటికి రైతుల ఖాతాల్లోకి నిధులు జమ కాకపోవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రబీలో పంట పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎరువులు, విత్తనాలు, కూలీలు, ట్రాక్టర్ బాడుగలు పెరగడంతో పంట సాగు కోసం డబ్బు పుట్టక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

వేరుశనగ సాగు చేస్తున్నా



రబీలో నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేయడానికి పొలాన్ని సిద్ధం చేసి ఉంచా. ధర్మవరం చెరువు నిండడంతో భూ గర్భజలాలు పెరిగి బోరు బావులలో పుష్కలంగా వస్తున్నాయి. అయితే ఈ సారి పంట సాగుకు ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.50వేల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది.

–నల్లపరెడ్డి, రైతు, తిప్పేపల్లి

15 నుంచి మంచి అదను



సాధారణంగా రబీలో వేరుశనగ పంటను ఈనెల 15 నుంచి డిసెంబర్ 15 లోపు విత్తనం వేసుకుంటే దిగుబడులు ఆశాజనకంగా వుంటాయి. ఈ ఏడాది రబీ సీజన్‌లో బోరు బావుల కింద వేరుశనగ పంటను చాలా మంది రైతులు సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. సాగు సమయంలో విత్తన శుద్ధి, ఎరువుల వాడకం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించాం.

–ముస్తఫా, వ్యవసాయాధికారి, ధర్మవరం మండలం

కలసి మెలసి జీవించండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప



ఈదుల ముష్టూరు గ్రామస్తులతో సమావేశమై మాట్లాడుతున్న ఎస్ఐ సోమశేఖర్

బత్తలపల్లి: గ్రామాల్లో కలసి మెలసి జీవించాలని ఎస్ఐ సోమశేఖర్ ప్రజలకు సూచించారు. ఆదివారం ఈదుల ముష్టూరు గ్రామంలో ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కక్షలు, కార్పణ్యాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, వాటి వల్ల మరింత దుర్భర జీవితం గడపాల్సి ఉంటుందన్నారు. పేకాట, మట్కా, మద్యానికి దూరంగా ఉండాలని, మద్యం విక్రయించేవారి సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రౌడీషీటర్లు, గత కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా వచ్చి తమకు సమాచారం ఇవ్వవచ్చునన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ధర్మవరం అర్బన్: రౌడీషీటర్లు, పాత కేసుల్లో నిందితులు ఎవరైనా గొడవలకు పాల్పడినా, గొడవలకు కారణమైనా కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ రెడ్డప్ప హెచ్చరించారు. పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ అందరిపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. గొడవల జోలికెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కనగానపల్లి విద్యార్థులు



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ రమేష్



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులతో పీడీ మాధవరాజులు

కనగానపల్లి: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పలు క్రీడల్లో కనగానపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీనాథ్, అర్చన, రిషిత.. జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో సత్తాచాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల పీడీ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్, పలువురు ఉపాధ్యాయులు వీరిని ప్రత్యేకంగా అభినందించారు. ఇక స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో (లాంగ్ జంప్) రేవంత్, హైజంప్‌లో హర్ష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల మాధవరాజులు ఓ ప్రకటనలో తెలిపారు.

డిసెంబరులోగా రోడ్డు పనుల పూర్తి



వాహనాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

గాండ్లపెంట: కదిరి నుంచి రాయచోటికి వెళ్లే రోడ్డు పనులను డిసెంబరులోగా పూర్తి చేస్తామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. రోడ్డు పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ తెప్పించిన 4 నూతన హిటాచీ, జెసీబీ వాహనాలను తాళ్లకాల్వ గ్రామ సమీపంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు కదిరి నుంచి గాండ్లపెంట, ఎన్పీకుంట వరకు రోడ్డు పనులు వేగంగా పూర్తి చేసి మంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు.

బాధితులకు దుద్దుకుంట పరామర్శ



సుబ్బరాయునిపల్లిలో గంగాధర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



తిరుపాల్‌నాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ద్విచక్ర వాహన ప్రమాదంలో చేయి విరిగి శస్త్ర చేయించుకొన్న నల్లమాడకు చెందిన ఆర్‌పీరెడ్డి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన గూడమేకలపల్లికి చెందిన మోహన్‌నాయుడు, సుబ్బరాయునిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న గంగాధర్‌ను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించి వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దొన్నికోటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బికారీ సాబ్(65), రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గూడమేకలపల్లికి చెందిన కే.శంకర(45) కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, సాంబశివారెడ్డి, యూత్ కన్వీనర్ నరసింహారెడ్డి, నరసింహమూర్తి, దుద్దుకుంట సురేంద్రరెడ్డి, నాగరాజునాయుడు, కమలాకర్‌నాయుడు, బాలాజీనాయుడు, గెంగినాయుడు, గోపాల్‌నాయుడు తదితరులున్నారు.

ఓడిచెరువు: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం పలువురిని పరామర్శించారు. టీ కుంట్లపల్లికి చెందిన తిరుపాల్‌నాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద ఉండగా మాజీ ఎమ్మెల్యే ఆయన్ను కలిసి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. ఎగువ చెర్లోపల్లికి చెందిన మేకల ప్రభావతి ఇటీవలే మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొండకమర్లకు చెందిన దొడ్డెప్ప(65) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందడంతో అక్కడికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. మండల కన్వీనర్ రాజునాయుడు, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, నాయకులులక్ష్మిరెడ్డి, రామసుబ్బారెడ్డి, సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరి, మధుసూదన్‌నాయుడు ఉన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం

ఓడీచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత టి.ఎస్. మహబూబ్‌బాషా కుమార్తె అమ్మజాన్, జాకీర్ నూతన దంపతులను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆశీర్వదించారు. విజ్ఞాన స్కూల్ కరస్పాండెంట్‌ను నూతన గృహాన్ని సందర్శించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహమ్మదాబాద్ క్రాస్‌లోని జెడ్పీటీసి దామోదర్‌రెడ్డి మిషన్‌లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండల కన్వీనర్ రాజు నాయుడు, షామీర్ భాషా, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, సర్పంచ్ గోవిందు ఉన్నారు.

టీడీపీ నేతపై కేసు

బత్తలపల్లి: కట్టకిందపల్లికి చెందిన టీడీపీ నాయకుడు విశ్వనాథనాయుడుపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. దంపెట్ల గ్రామంలో పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు చితంబరరెడ్డి, వెంగళరెడ్డితో పాటు మరికొందరు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వారి వెంట డి.చెర్లోపల్లికి చెందిన టీడీపీ నేత దరూరు రామకృష్ణ వెళ్లాడు. అతడిని చూసి నువ్వు ఎవ్వరివి మా పంచాయతీలో సభ్యత్వం చేసేందుకు వచ్చావంటూ విశ్వనాథనాయుడు దూషిస్తూ, చెప్పుతో దాడి చేసేందుకు యత్నించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేసు నమోదు

కదిరి టౌన్: దాడి ఘటనలో ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు..పట్టణంలోని పూల బజార్‌లో ఉన్న హరిప్రసాద్ తన ఆకుకూర తోట వద్ద ఉండగా అదే కాలనీకి చెందిన బాలమురళీకృష్ణ టపాసులు కాల్చేందుకు వచ్చాడు. అక్కడ టపాసులు కాల్చొద్దని హరిప్రసాద్ అడ్డుచెప్పాడు. కోపోద్రిక్తుడైన బాలమురళీకృష్ణ హరిప్రసాద్‌పై ఇటుకరాళ్లతో దాడి చేయడంతో తలకు రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

16న 'అనంత'లో మాదిగల ఆత్మీయ సదస్సు



సమావేశమైన మాదిగ ఉద్యోగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

కదిరి: ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 16న అనంతపురంలో మాదిగల ఆత్మీయ సదస్సు నిర్వహించనున్నట్లు మాదిగ ఉద్యోగుల సమాఖ్య(ఎంఈఎఫ్)జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఎమ్మార్పీఎస్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, ఈ మేరకు సుప్రీం కోర్టు సైతం తీర్పునిచ్చిందని ఆయన గుర్తు చేశారు. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టి దళితులందరికీ న్యాయం చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఆయన తక్షణం తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యాకే వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. మాదిగల ఆత్మీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగలు, మాదిగ జాతి మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంఈఎఫ్ జాతీయ సభ్యులు జి.ఆనంద్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పలక ఆంజనేయులు, విజయ్, కదిరి డివిజన్ అధ్యక్షులు కె.శ్రీనివాసులు, ఎంఈఎఫ్ నాయకులు చిన్నప్పయ్య, నాగప్ప, పుల్లన్న, శివనాథ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు విశ్వనాథ్, శ్రీనివాసులు, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత ఆదివారం తెలిపారు. మండలస్థాయి అధికారులందరూ హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా అందజేయాలని సూచించారు.

విరాళం అందజేత

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ పదవీ విరమణ సంఘం నిధికి రిటైర్డ్ అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ ఆదివారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

'కంది'లో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

బత్తలపల్లి: ఖరీఫ్ కింద సాగు చేసిన కంది పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా దాదాపు 6,000 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారన్నారు. సకాలంలో వర్షాలు రావడం వల్ల ప్రస్తుతం పూత దశకు చేరుకుందని, కొన్ని స్వల్పకాలిక రకాల్లో కాపు ప్రారంభమైనట్లు తెలిపారు. పూత, కాపు దశలో గులాబీ రంగు పురుగు పంటను తీవ్రంగా నష్టపరుస్తుందన్నారు. నివారణకు లీటర్ నీటికి 5 మిల్లీ లీటర్ల వేపనూనె, 2 మిల్లీ లీటర్ల ప్రొఫెనోపాస్, 2 మిల్లీ లీటర్ల క్లోరిఫైరిఫాస్ కలిపి పిచికారీ చేయాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎన్పీకుంట: వెలిచలమల గ్రామానికి చెందిన హరిత రాయబారి మాతంగి రెడ్డప్ప (33) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు రెడ్డప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియ పరిచారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు వజ్రభాస్కర్‌రెడ్డి రూ.10,000 స్థానిక నాయకులు రూ.13,000 నగదు అందజేశారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

దుకాణం లేదు.. మద్యం విక్రయాలు ఆగలేదు!

- తాడిమర్రిలో ప్రారంభం కాని మద్యం దుకాణం
- పత్తాలేని ఎక్సైజ్ అధికారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



తాడిమర్రి: ప్రభుత్వం గత నెలలో మద్యం టెండర్లు ప్రారంభించినా తాడిమర్రిలో ఇప్పటికీ మద్యం దుకాణం ప్రారంభం కాలేదు. దీంతో తాడిమర్రితో పాటు మండలంలోని గ్రామాల్లో మద్యం బ్లాక్‌లో విచ్చలవిడిగా లభిస్తోంది. బ్లాక్‌లో మద్యం విక్రయాలు అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు పత్తాలేరు. మరో పక్క బ్లాక్‌లో మద్యం అమ్మకంపై పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి . ఈ చర్యలు అక్రమ మద్యం విక్రయదారులకు అవకాశంగా మారింది. అధిక రేట్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బాటిల్‌పై రూ.50 అధికంగా తీసుకుంటూ మద్యం విక్రయిస్తున్నారు. ప్రభుత్వం మద్యం దుకాణాల ఏర్పాటు కోసం గత నెల 14న లాటరీ తీసి దుకాణాల నిర్వాహకులను ఎంపిక చేసింది. తాడిమర్రి దుకాణం షాపు నంబర్ 16ను హైదరాబాద్‌కు చెందిన కొండపల్లి గణేష్ అనే వ్యక్తికి దుకాణం దిక్కింది. 16న దుకాణం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ అనుమతి ఇచ్చింది.

కూటమి నేతల మధ్య వివాదం

లాటరీలో మద్యం దుకాణం పొందిన వ్యక్తి నుంచి తాడిమర్రికి చెందిన బీజేపీ నాయకుడు లీజుకు మాట్లాడుకుని మద్యం దుకాణం ఏర్పాటుకు అద్దె గదిని తీసుకున్నారు. మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేసుకున్నారు. ఈ సంగతి తెలుసుకున్న టీడీపీ మండల నాయకులు పెద్ద ఎత్తున మద్యం దుకాణం వద్దకు చేరుకుని అడ్డుకున్నారు. మద్యం లోడ్ వచ్చి సరుకు దించుకుంటున్న బీజేపీ నాయకుడు, అతడి అనుచరులపై టీడీపీ నాయకులు చేయి చేసుకున్నారు. దీంతో మద్యం అన్‌లోడ్ చేయకుండా వాహనం వెనుతిరిగి పోయింది. పోలీసులు సకాలంలో స్పందించి ఇరువర్గాల వారిని చెదరగొట్టి గొడవ సద్దు మనిగించారు. చివరకు మద్యం దుకాణం బీజేపీ నాయకుని నుంచి టీడీపీ నాయకులు బలవంతంగా తీసుకున్నారనే విమర్శలు వినిస్తున్నాయి. తాడిమర్రికి మద్యం దుకాణం కేటాయించి 20 రోజులు గడిచినా దుకాణం ఏర్పాటు కాక పోవడంతో మద్యం ప్రియులు ఆందోళన చెందుతున్నారు. బ్లాక్‌లో అధిక ధరలు పెట్టి కొనలేక, మద్యం తాగకుండా ఉండలేక అవస్థలు పడుతున్నారు. మద్యం ప్రియులు మద్యం దుకాణం ఏర్పాటు కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.